# సమాజానికో సవాల్

## కోమకొండ సత్యానంద్

**వితంతు వివాహాల గురించి ఎందరో మహానుభావులు కష్టించి కొంత సాధించినా, ఆ దురాచారం ఇంకా మిగిలిపోయిన కుటుంబాలలో వితంతువులు వాళ్ళలో వాళ్ళు కుమిలిపోతూ, వయసు తెచ్చే అందమైన చిగురుల్ని నాశనం చేయలేక, మోడులా జీవించలేక ఏదో సాధించాలని మార్చలేని ఈ సమాజానికి సవాళ్ళు కొడుతూ వాళ్ళ గోతుల్ని వాళ్ళే తీసుకుంటూ పూర్తిగా నాశనమై పోతున్నారు. మరి వాళ్ళ సవాళ్ళకు ఫలితం?**

అది ఒక ఖరీదైన పెళ్ళి పందిరి. ఆ పందిట్లో కన్నెలు, ప్రౌఢలు, వృద్ధులు పకపక మంటున్నారు. కన్నె పిల్లల చుట్టూ యువకుల ఓర చూపులు తిరుగుతున్నాయి. పెళ్ళి పెద్దలందరూ హడావుడిగా తిరుగుతున్నారు. క్రొత్తగా పెళ్ళయిన జంటలు ఒక చోట కూర్చొని తమ పెళ్ళి ముచ్చట్లను నెమరు వేసుకుంటున్నారు. ముత్తైదువలు గంట కొకటి, గడియ కొకటి చీరల్ని మార్చుతూ ఆనందంగా పెళ్ళి పందిట్లోంచి ఇంట్లోకి, ఇంట్లోంచి పెళ్ళి పందిట్లోకి తిరుగుతున్నారు.

ఒక చోట అరుగు మీద కుర్చీ వేసుకుని కూర్చున్న గోపాల్ అందర్నీ పరిశీలనగా చూస్తున్నాడు.

పెళ్ళి చాలా వైభవంగా జరుగుతూంది. పెళ్ళిలో జరిగే సంప్రదాయ తంతు లన్నింటినీ సరదాగా చూస్తున్నాడు గోపాల్. అత నలా చూస్తుండగా అతని కళ్ళలో పడిం దో సుందరాంగి. పందిరికి దూరంగా వేరొక ఇంటి గుమ్మం దగ్గర నిల్చుం దామె. అక్కడున్న లైటు వెలుతురులో ఆమె చాలా స్పష్టంగా కనిపిస్తూంది. గోపాల్ చటుక్కున లేచాడు. నెమ్మదిగా అటువైపు నడిచాడు. ఆమె గోపాల్ వైపే చూస్తూంది. గోపాల్ దగ్గరకు రావడంతోనే ఆమె తన చూపును వేరొకవైపు మరల్చుకుంది. గోపాల్ దగ్గరగా వెళ్ళాడు. తెల్లని చంద్రకాంతితో ఆమె బట్టలు పోటీ పడుతున్నాయి. తెల్లని పాల నురగల్లాంటి ఆ దుస్తుల్లో ఆమె బాగా వికసించిన మల్లెపువ్వులా ఉంది.

గొంతు సవరించుకొని "కాస్త మంచి నీళ్ళు ఇస్తారా?" అని అడిగాడు.

ఆమె గోపాల్ వైపు చూసింది. ఆ చూపులో ఏదో ప్రశాంతత కనిపించింది గోపాల్‌కు. ఆమె లోపలకు వెళ్ళింది.

ఆ చుట్టు పక్కల ఎవరూ లేరు. అందరూ పెళ్ళి చూసేందుకు వెళ్ళిపోయారు. కాని ఈమె ఒక్కతే ఎందుకుం దిక్కడ? తనలో తనే అనుకున్నాడు.

ఆమె మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. అందుకుంటూ ఆమె ముఖం వైపు చూశాడు.

అంతే! గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది.

ఆమె ముఖాన బొట్టు లేదు. గోపాల్‌కు చిన్న అనుమానం కలిగింది.

మంచినీళ్ళు త్రాగి తిరిగి గ్లాసు ఇస్తూ "మీరు. . ." అన్నాడు.

"మోహన్ కజిన్‌ని" అం దామె.

"మీ రొక్కరే ఇక్కడ. . ."

"అది నా తలరాత" అంటూ వెళ్ళిపోయింది చరున.

గోపాల్ మనసు చాలా బాధ పడింది. అయితే మోహన్ చెప్పిం దీమె గురించేనన్న మాట.

గోపాల్ మనసు చీకాకుగా తయారయింది.

"అనవసరంగా ఆమెను బాధ పెట్టాను" అనుకుంటూ పందిరి దాటి రోడ్డు మీదకు వెళ్ళాడు. రాత్రి చాలా టైము కావడాన అంతా నిర్మానుష్యంగా ఉంది. సిగరెట్ తీసి వెలిగించాడు. అక్కడున్న కాలువ గట్టు మీద కూర్చున్నాడు.

అతని ఆలోచనంతా ఆమె గురించే.

చదువుకులే రోజుల్లో మోహన్ ఆమె గురించి చెప్పాడు.

ఆమె పేరు నీలవేణి. బాలవితంతువు. పెళ్ళయిన కొద్ది రోజుల్లోనే పురుగు కుట్టి చనిపోయాడు భర్త. అప్పట్నించీ ఆమె అలాగే ఉండిపోయింది.

అప్పుడు అలా మోహన్ చెపుతుంటే గోపాల్‌కు చాలా బాధ కలిగింది. సమాజం ఇంతగా ఎదిగిపోయినా, పాత మూఢ నమ్మకాలు ఇంకా పోలేదా? అని ఆశ్చర్య పోయాడు.

ఆ మర్నాడు మోహన్‌తో నీలవేణి ప్రస్తావన తెచ్చాడు.

"శుభ్రంగా చెడిపోయింది. . ." అని కసురు కున్నాడు.

"ఏరా అప్పుడు చాలా మంచిదన్నావ్?" మోహన్ చెప్తుందేమిటో అర్థంగాక ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్.

"అప్పుడు మంచిదేరా! ఇప్పుడే దాని బుద్ధి గడ్డి కరిచింది. ఎవడు దొరికితే వాడితోనే కులుకు తుంది. అది నా కజిన్ అని చెప్పుకోడానికే సిగ్గే స్తూంది" అన్నాడు చీదరించుకుంటూ.

గోపాల్‌కు ఏమీ అర్థం కాలేదు.

ఆ రోజు రాత్రి గోపాల్ నీలవేణి ఇంటికి వెళ్ళాడు. నీలవేణి నవ్వుతూ పలకరించింది. విన్నటికీ, ఇవాల్టికీ ఎంత తేడా? అనుకున్నాడు గోపాల్. లోపలకు రమ్మంది నీలవేణి. లోపలకు వెళ్ళాడు. తన గదిలోకి తీసుకువెళ్ళింది. ఆ గదంతా అర్ధనగ్న చిత్రాలతో నిండి ఉంది. గోపాల్ వాటివైపు జుగుప్సగా చూశాడు.

"మీరు. . ."

"అవును. . . ఇప్పటికి మీకు తెలిసే ఉంటుంది. మోహన్ చెప్పే ఉంటాడు."

మౌనంగా కూర్చున్నాడు గోపాల్.

"నా మీద మీ అభిప్రాయం చాలా నీచంగా ఉంది కదూ. ఎవ్వరికైనా అలాగే ఉంటుంది" అంది గోపాల్ ఫీలింగ్స్‌ను బట్టి.

"అన్నీ తెలిసి మీరు ఇలా. . ."

"అవును అన్నీ తెలుసు. . . అన్నీ తెలుసుకున్నాను కనకనే ఈపని. . . ఏం చేసేది? బాల్యంలోనే ఎవరికో ఇచ్చి పెళ్ళి చేసి, వా డెలాగో చచ్చిపోతే అదేదో నా తప్పని భావించి, నన్ను వెలివేసినట్టుగా చూసే ఈ పెద్ద లందరకూ బుద్ధి చెప్పాలనే నేనీ పని చేస్తున్నాను. . . అంతేకాదు, నాకూ కోరిక లున్నాయ్, నాకూ సంసార జీవితం మీద మోజు ఉంది. . . అందుకే నాకు పెళ్ళి చేయమని అడిగితే విరగబడి నవ్వారు ఈ పెద్దలు. వెకిలిగా చూశారు తోటి వయస్కులు. చావనివ్వరు. . . బతకనివ్వరు. అందుకే ఈ చావు బతుకుల మధ్య వూయల లూగు తున్నాను. . . హాయిలో మునిగి తేలుతున్నాను. . ."

"ఆ హాయి ఈ సంఘంలో ఎంత నీచమో మీకు తెలియదా?"

"సంఘం? ఎవరండీ సంఘం? ఒకసారి ఒక పెద్దమనిషి ప్రేమించానని, పెళ్ళి చేసుకుంటానని వెంటబడి, తన రూపం నాలో ప్రతిబింబించి సమాజానికి భయపడి పారిపోయాడు. అతని ఫలితంగా ఒక పాపకు తల్లి నయ్యాను. . . అదే మేము ధనవంతులమే అయ్యుంటే, నేను మళ్ళీ పెళ్ళి చేసుకుంటే నన్నో పెద్ద దేవతలా, ఆ వచ్చిన పురుష పుంగవుడ్ని సంఘోద్ధారకుడిగా భావించి ఎంతో గౌరవం ఇచ్చేవారు. . . కానీ ఆ డబ్బే నాకు లేదు. . . మీరుకూడా ఈ సంఘంలో మనిషే కదా. అయితే డబ్బు లేని ఈ వితంతువుకు మీరు భర్తగా ఉండి రక్షణ నీయగలరా? " ఆవేశంగా అడిగింది నీలవేణి.

"చేయి దాటి పోయింది నీలవేణిగారూ. మీరు శీలం పోగొట్టుకొనక పోతే నేను మిమ్మల్ని చేసుకునే వాడ్ని."

పిచ్చిగా నవ్వింది నీలవేణి. . . "గోపాల్ గారూ! శీలం అంటే ఏమిటండీ? భౌతికమైన సెక్సేనా




శీలమంటే? నా దృష్టిలో అది శీలం కాదు. . . ఇంట్లో పతివ్రతలా ఉంటూ, వారి మనస్సులు కళ్ళాల్లేని గుర్రాలై, పర సుఖాల్ని అనుభవించాలన్న కోరిక ఉండి, వీలు లేక, ఇంట్లో ఏమీ ఎరగని బేలలా ఉండే స్త్రీకి శీలం ఉందంటారా? చాటున బిడ్డను కని,ఆ బిడ్డను పాపంగా భావించి, చిరునవ్వులు చిందించే ఆ చిన్నారి పాప పీక నులిమి చంపి, కన్యగా నటించే కుమారి కూడా శీలవతేనా? శీలం అనేది మనసుకుండాలిగానీ, ఈ సంఘం కట్టిన కట్టుబొట్లకు లొంగిపోయిన అందరికీశీలం ఉందంటారా? ఇవన్నీ చెప్పి మిమ్మల్ని నన్ను పెళ్ళి చేసుకోమని ఒప్పించడం నా అభిమతం కాదు. . .డబ్బు లేని వాళ్ళకు అన్నీ కట్టుబొట్లే! నవ్వినా తప్పే! ఏడ్చినా తప్పే!. . .అందుకే, మంచిని చెడుగాను, చెడును మంచిగాను, చూపించే ఆ డబ్బును గడించాలి. . . పిచ్చిగా గడించాలి. . .ఆ పిచ్చిలో వెర్రిగంతు లేయాలి. అంతవరకూ నేను సర్వనాశనమైనా ఫర్వాలేదు. నేనిలాగే బ్రతుకుతాను. అయినా మీరిప్పుడెందుకొచ్చారు? ఆ మోహన్ చెప్పిన మాట విని, నా మీద ఆశతో రాలేదూ? పైకెందుకండీ అలా వెగటు చూపు చూస్తారు? ఆవేశంతో వూగిపోయింది.

"మీరు నన్ను తప్పుగా అంచనా వేస్తున్నారు నీలవేణిగారూ!. . .వస్తాను . . . వెళ్ళే ముందు ఒక చిన్న మాట. . .నేనెప్పుడూ మీకు స్నేహితుడ్నే నా సహాయ సహకారాలు మీకెప్పుడూ ఉంటాయి. నన్నింకోలా అర్థం చేసుకోకండి" అని వెళ్ళిపోయాడు గోపాల్.

* * *

ఆ సంఘటన జరిగి చాలా రోజులైపోయింది. గోపాల్‌కు కూడా పెళ్ళయిపోయింది.

ఆ రోజు బస్టాండులో నుంచున్నాడు గోపాల్. అతనికి కొంచెం దూరంగా ఎవరో అమ్మాయి ఒక యువకునితో మాట్లాడుతూంది. అతను ఆమెకు కొని పది రూపాయల నోట్లు ఇచ్చి వెళ్ళిపోయాడు. ఆ అమ్మాయి నోట్లను హాండ్ బాగ్‌లో పెట్టుకుని తృప్తిగా నవ్వుతూ బస్టాండు వైపుకు వచ్చింది. అప్పుడు గుర్తుపట్టాడు గోపాల్ ఆ అమ్మాయిని. ఆ అమ్మాయి నీలవేణి.

"నీలవేణిగారూ!" పలకరించాడు గోపాల్.

ఉలిక్కిపడి చూసింది నీలవేణి. పలకరింపుగా నవ్వుతూ దగ్గరకు వచ్చింది "బాగున్నారా" అంటూ.

"బాగానే ఉన్నాను—మీరిక్కడికి వచ్చారేమిటి? బాగున్నారా? అతనెవరు?" ఆత్రతగా అడిగాడు గోపాల్

అతని ప్రశ్నలకు తీరుబడిగా నవ్వింది నీలవేణి.

"బాగానే ఉన్నాను. నేనొచ్చి పూర్తిగా సంవత్సరం దగ్గరయ్యింది."

"ఇక్కడికి ఎందుకు వచ్చారు? మీ వాళ్ళు కూడా వచ్చారా?" అన్నాడు గోపాల్.

"పిచ్చి ప్రశ్న. ఎందుకొస్తారు? వ్యాపారం బాగా సాగదు పని ... మీకు తెలియదనుకుంటాను, నా పేరు "జ్యోతి"గా మార్చుకున్నాను. ఎలా ఉంది ... మా వాళ్ళు సంగతంటారా? నా వాళ్ళన్న వారు ప్రత్యేకంగా ఎవరూ లేరు ... అందరూ నా వాళ్ళే!!" అంది నీలవేణి.

"నా కేమీ అర్థంగావడం లేదండీ మీరు చెప్పేదేమిటో!" అయోమయంగా అన్నాడు గోపాల్.

"అర్థం కావడానికేముందండీ ఇందులో? ఇప్పుడు నాకు సంపద సంపాదించి పెట్టే వనరు నా భర్త."

"మీరు పెళ్ళి చేసుకున్నారన్న మాట!" సంతోషంగా అన్నాడు గోపాల్.

"ఛీ. గోపాల్‌గారూ! మాట పూర్తిగా వినండి. అతను నా భర్త, ఈ ఒక్క రాత్రి వరకే, ఒక్క వంద రూపాయలిస్తే నేనెవరికైనా భార్యగా ఉంటాను. నాకు కావాల్సింది డబ్బు." నిర్లిప్తంగా నవ్వుతూ అంది నీలవేణి.

"నీలవేణిగారూ మీరెందుకిలా అట్టడుగుకు పడిపోతున్నారు? ఎందుకిలా లోకానికి దూరమై మిమ్మల్ని మీరే నాశనం చేసుకుంటున్నారు?"

"గోపాల్‌గారూ! నా దారిని మీరు కించపరిస్తే నేను సహించను." తీవ్రంగా అంది.

"మీ రేమన్నా సరే ఇది నాకు నచ్చలేదు. స్నేహితుడిగా మీకు నేను సహాయం చేస్తాను. ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తాను. హాయిగా బ్రతకండి ... కాస్త ఆలోచించండి ... రేపు మా ఆఫీసుకు రండి, ఇదిగో అడ్రసు" అంటూ చేతిలో విజిటింగ్ కార్డు అందించాడు.

క్షణంసేపు ఆలోచించి అందుకుంది నీలవేణి.

కంటిలో నీరు వచ్చింది.

"థాంక్స్ గోపాల్ గారూ! రేపే మీ ఆఫీసుకు వస్తాను. మంచి ఉద్యోగం ఇప్పించండి. మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను" అంటూ వెళ్ళి పోయింది.

గోపాల్ బరువుగా నిట్టూర్చాడు.

* * *

ఆర్నెల్లు గడిచాయి. నీలవేణి ఆఫీసుకు వస్తూంది. నీలవేణి నవ్వు ఇప్పుడు చాలా నిర్మలంగా ఉంటుంది. ఆమె ఇప్పుడు చాలా రిజర్వ్‌డ్‌గా ఉంటుంది అందరి దగ్గరా ... నీలవేణి తన ప్రవర్తన మార్చుకున్నందుకు గోపాల్ కెంతో సంతోషంగా ఉంది. గోపాల్ చూసిన ఇంటిలో నీలవేణి, పాప ఉంటున్నారు. నాశనం అయిపోవాల్సిన ఒక జీవితాన్ని బాగు చేసినందుకు గోపాల్‌కు చాలా సంతృప్తిగా ఉంది.

ఆ రోజు నీలవేణి నవ్వుతూ గోపాల్ దగ్గరకు వచ్చింది ఒక కవరు పట్టుకొని ... చూశాడు గోపాల్.

"మీకు హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ వచ్చిందా?" ఆత్రతగా అడిగాడు గోపాల్.

## తుది గమ్యం

లోకమంతా మేల్కొన్నప్పుడు
తెలివితో నిద్రిస్తున్న నేను
నా రెప్పల కింద
ఏదీ కాదు అదృశ్యం
శబ్దం
దృశ్యం
చర్య
క్రియ
అన్నీ ఎప్పుడో, ఏ జన్మలోనివో
నా రక్తనాళాలు వేసే పాలికేక
నా ఆలోచనలు గీసే రేఖల చిత్రిక
నా ఊహల మార్గాలు
పయనించే చైతన్య తుది గమ్యం
తప్పు

— బి. చంద్ర

ఉవున్నట్టు తలూపింది నీలవేణి.

"నాకు చాలా బాధగా ఉందండీ! అయినా ఆర్నెల్లకే ట్రాన్స్‌ఫర్ చేసేసిందేమిటి?" ఆశ్చర్యంగా అన్నాడు.

"ఏమో, అదే నేనూ అనుకుంటున్నాను. అయినా బాధ దేనికండీ? మీరు మంచివారు కనుక నన్నిలా ఆదరించి నాకో దారి చూపించారు. పాతాళంలోకి జారిపోతున్న నన్ను, నా కథను ఒక కొలిక్కి తెచ్చారు. మీ ఋణం మరచిపోలేను ... మీరు ఏది కావాలన్నా—చివరకు నా శరీరమైనా సరే మీకు అర్పించుకోగలను ... ఏమంటారు!"

"క్షమించండి నీలవేణీ! మీ రిక ఆ జీవితాన్ని పూర్తిగా మరచిపోవాలి ... క్రొత్త జీవితం ప్రారంభించి ఆనందంగా ఉండండి. ఎవరినైనా ఒక మంచి

★

మనల్ని మనం పొగుడుకోనంతకాలం ఇతరుల పొగడ్తలవల్ల మనకు ఎలాంటి అపకారం జరగదు.

— లోప్ ఫికార్డ్

★

మనిషిని చూసి పెళ్ళి చేసుకోండి ... పెళ్ళి చేసుకునే ముందు నాకో శుభలేఖ పంపండి, చాలు ..."

నిరాసక్తిగా నవ్వింది నీలవేణి...

"మరి వస్తానండి ... రేపు ప్రయాణానికి అన్నీ సర్దుకోవాలి ..." అని వెళ్ళిపోయింది.

ఆ మర్నాడు ప్రయాణమయింది నీలవేణి.

గోపాల్ నీలవేణిని, పాపను దగ్గరుండి స్టేషన్‌కు తీసుకు వెళ్ళి రైలెక్కించాడు.

"అప్పుడప్పుడూ ఉత్తరాలు వ్రాస్తుండండీ."

"ఉత్తరాలేమిటండీ? వీలుంటే వస్తుంటాను కూడా!" అన్నాడు గోపాల్.

పాప నవ్వుతూ టాటా చెప్పింది.

ఆ పాపను చూస్తుంటే గోపాల్ మనసు కరిగి పోయినట్లయింది. ఎంతో దగ్గర బంధువుల్లా విడిపోయేందుకు చాలా బాధపడ్డారు వాళ్ళు.

* * * *

గోపాల్ ఆఫీసులో సీరియస్‌గా పని చేసుకుంటున్నాడు.

పోస్ట్‌మాన్ వచ్చి ఏదో కవరు ఇచ్చాడు.

అది నీలవేణి వ్రాసిన ఉత్తరం.

కవరు చించి చదవడం మొదలు పెట్టాడు.

"గోపాల్‌గారూ! నమస్కారం. మీ ఆదర్శ భావాలతో నన్ను మార్చి చూసి, ఒక గట్టుకు చేర్చినందుకు నేను, నా పాప మీ కెంతో ఋణపడి ఉన్నాం! ఇప్పుడు మీ కీ ఉత్తరం వ్రాసింది ఒక నిజాన్ని చెప్పేందుకు ... అకస్మాత్తుగా నా కొచ్చిన ఈ ట్రాన్స్‌ఫర్ నేనే కష్టపడి చెప్పించుకున్నది, మన గుమాస్తాలతో ఒక రాత్రి గడిపి. ఎందుకో తెలుసా? మీ ఎదురుగా ఉండగా నాకు వ్యభిచారం చేయడం ఎందుకో బుద్ధి పుట్టేది కాదు. ఎందుకో మరి నాకు తెలియదు. నాకు డబ్బు కావాలి. అదెందుకో తెలుసా? నా చిన్నారికోసం? దాన్ని డబ్బుతో పెంచాలి ... డబ్బుతో ముంచాలి ... డబ్బుమీద నడిపించాలి. డబ్బు దాని జీవితానికి రక్షణ కావాలి. అందుకే పది మంది బడవాలి ... దాన్ని ఒక్క మాటైనా అనడానికి ఎవరికీ ధైర్యం ఉండకూడదు. అంతా దానిష్ట ప్రకారమే జరగాలి ... నా లాగ దాని జీవితం నాశనం కాకూడదు. అందుకే నేనింకా డబ్బు గడించాలి. అంతా దానికోసమే! అందుకే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. దర్జాగా వ్యభిచారం చేస్తాను. నా కోరిక తీరా గడిస్తాను. దానికి తన తల్లి వ్యభిచారిణి అని తెలిసే రోజుకు ముందుగా దానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చూసి నా జీవితాన్ని అంతం చేసుకుంటాను. నా జీవిత గమనాన్ని నిలుపుకుంటాను.

"వీలుంటే నా దగ్గరకు వస్తానని మీరు స్నేహపూర్వకంగా చెప్పారు ... మీరు దయచేసి ఆ ప్రయత్నం చేయొద్దని మనవి చేసుకుంటున్నాను. ఇలా వ్రాశానని మీరు నన్ను తిట్టుకోండి, అసహ్యించుకోండి ... చీదరించి ఉమ్మేయండి ... కానీ ఇది నా జీవితాశయం! మారీ మారని ఈ సమాజానికో సవాల్!

మరి ఉంటాను.

— నీలవేణి."

ఆ ఉత్తరాన్ని పట్టుకొని నిర్విణ్ణుడై పోయాడు గోపాల్.

★